

దుర్గమ్మా.. మముబ్రోవుమా..

దసరా మహోత్సవాలు ఊరూవాడా ఘనంగా జరుగుతున్నాయి. అమ్మవారి ఆలయాల్లో పూజలు, హోమాలు నిర్వహిస్తున్నారు. పిడుగురాళ్ల పట్టణంలో కన్యకాపరమేశ్వరికి అలంకరణ, వినుకొండలో కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు
- న్యూస్‌టుడే, పిడుగురాళ్ల, వినుకొండ



ఈనాడు పల్నాడు

శుక్రవారం అక్టోబరు 11, 2024

ఇసుక లారీలు స్వాధీనం

అచ్చంపేట, న్యూస్‌టుడే: అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీలపై రెవెన్యూ, పోలీసు అధికారులు గురువారం దాడులు చేశారు. మాదిపాడు వైపు నుంచి ఇసుకను తరలిస్తున్న నాలుగు లారీలను కొండూరు వద్ద ఆపి పరిశీలించగా.. ఎలాంటి పత్రాలు చూపకపోవడంతో వాటిని అచ్చంపేట పోలీసుస్టేషన్‌కు తరలించినట్లు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. అలాగే క్రోసూరు వద్ద తనిఖీ చేసి మూడు లారీలను స్వాధీనం చేసుకుని, స్టేషన్‌కు తరలించారు. దాడుల్లో సీఐ వెంకటప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.



క్రోసూరు పోలీసుస్టేషన్‌లో ఇసుక లారీలు

పల్నాడులోనే పోటీ తక్కువ!


- మద్యం దుకాణాలకు తగ్గిన దరఖాస్తులు
- ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లే కారణమా?

ఈనాడు డిజిటల్, నరసరావుపేట

ప్రైవేటు మద్యం దుకాణాల టెండర్లకు సంబంధించి రాష్ట్రంలోనే జిల్లాలోనే తక్కువ దరఖాస్తులొచ్చినట్లు ఎక్సైజ్ అధికారులే ప్రకటించారు. అందుకు ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లే కారణమా..? లేక వ్యాపారుల్లో ఆసక్తి లేకపోవడమా? అనే దానిపై ఆ శాఖ ఉన్నతాధికారులు తలలు పట్టుకుంటున్నారు. జిల్లాలో మొత్తం 129 మద్యం దుకాణాలకుగాను గురువారం సాయంత్రం నాటికి 1798 దరఖాస్తులొచ్చాయి. ఒక దుకాణానికి సగటున ఈసారి 14 దరఖాస్తులొచ్చాయని అధికారులు చెప్పారు. అదే గతంలో అయితే ఒక దుకాణానికి సరాసరి 20 దరఖాస్తులొచ్చాయి. ఈసారి దరఖాస్తు ఫీజు రూ.2 లక్షలు కావడం.. అదీ వెనక్కి మళ్లీ రాదనే నిబంధనల నేపథ్యంలో ఎక్కువ మంది దరఖాస్తు చేయడానికి ముందుకు రాలేదని తెలుస్తోంది. మరోవైపు ఒక వేళ అంత ఖర్చుపెట్టి దరఖాస్తు చేస్తే లక్కీడ్రాలో వస్తుందా? రాదా? పెట్టిన సొమ్ము పోతే ఎలా? అని కూడా కొందరు ఆలోచించినట్లు ఆయా వర్గాలు వెల్లడిస్తున్నాయి. శుక్రవారం మద్యం దుకాణాల టెండర్ల దరఖాస్తు చేయడానికి చివరి రోజు. ఈ రోజు ఎన్ని వస్తాయోనని అధికారులు లెక్కలు కడుతున్నారు. శని, ఆదివారాల్లో దరఖాస్తులను పరిశీలించి, ఈనెల 14న లాటరీ తీయనున్నారు.

ఎమ్మెల్యేలు జోక్యం చేసుకోవద్దని..

మద్యం దుకాణాల టెండర్ల దరఖాస్తుల విషయంలో ఆయా ప్రజాప్రతినిధులు, వారి బంధువుల జోక్యం ఎట్టి పరిస్థితుల్లో ఉండకూడదని ఇటీవల సీఎం స్పష్టం చేశారు. ఇందులో రాజకీయ ప్రమేయం ఉండకూడదని తెలియజేశారు. అయినా సరే జిల్లాల్లో దరఖాస్తులు భారీస్థాయిలో రావడం లేదు. కొందరు ప్రజాప్రతినిధులు ముందస్తుగానే వాటాల శాతం కోరడం.. సంవత్సరం ఇంత మొత్తం ఇవ్వాలని ఆదేశాలు జారీ చేయడంతో తమ వల్ల కాదని కొందరు దరఖాస్తు చేయడానికి ముందుకు రావడం లేదని తెలుస్తోంది. అదీకాకుండా పార్టీలకతీతంగా వ్యాపారం చేసుకునే పరిస్థితి కూడా లేకపోవడం కూడా ఒక కారణమని చెప్పొచ్చు. వ్యాపారాల్లో రాజకీయ జోక్యం లేకుంటే ఈపాటికి భారీగా దరఖాస్తులొచ్చేవని మద్యం వ్యాపార వర్గాలు చెబుతున్నాయి.



ఎక్సైజ్ స్టేషన్ల వారీగా కేటాయించిన దుకాణాలు.. దరఖాస్తుల వివరాలు

స్టేషన్	దుకాణాలు	దరఖాస్తులు
నరసరావుపేట	17	208
చిలకలూరిపేట	17	164
క్రోసూరు	10	139
సత్తెనపల్లి	15	173
వినుకొండ	14	275
ఈపూరు	9	188
పిడుగురాళ్ల	12	254
గురజాల	17	214
మాచర్ల	10	84
పెదకూరపాడు	10	117

దుకాణాలకు ప్రభుత్వ భద్రత : డీసీ

నరసరావుపేట టౌన్, న్యూస్‌టుడే : దరఖాస్తు చేసుకుని లాటరీలో మద్యం దుకాణం దక్కించుకున్న వారి వ్యాపార నిర్వహణకు ప్రభుత్వం భద్రత కల్పిస్తుందని అబ్కారీ శాఖ డిప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాస్ తెలిపారు. నరసరావుపేట ఆ శాఖ జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ.. జిల్లాలో ఎక్కువ దుకాణాలున్నాయని, వీటికి తక్కువ సంఖ్యలో దరఖాస్తులు వేశారన్నారు. వెబ్‌సైట్‌లో వీటిని పరిశీలించి తక్కువొచ్చిన వాటికి ఆశావహులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వినుకొండ నియోజకవర్గంలో స్వేచ్ఛగా మద్యం దుకాణాలు నిర్వహించుకునేందుకు దరఖాస్తు చేసుకోవచ్చని అక్కడి ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తమతో చెప్పారన్నారు. జిల్లాలో ఒక్కొక్క దుకాణానికి సగటున 13 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఆన్‌లైన్‌లో ఇంట్లో లేదా ఇంటర్ నెట్ కేంద్రాలు, తమ శాఖ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకునేందుకు శుక్రవారం రాత్రి 7 గంటల వరకు కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. దరఖాస్తుదారుల సమక్షంలో ఈ నెల 11న నరసరావుపేట టౌన్‌హాల్‌లో జిల్లా పాలనాధికారి లాటరీ తీస్తారన్నారు. 16న ఉదయం నుంచి ప్రైవేటు దుకాణాల్లో వ్యాపారం చేసుకోవచ్చని ఆయన సూచించారు. సమావేశంలో సహాయ కమిషనర్ రవికుమార్‌రెడ్డి, ఈఎస్ మణికంఠ, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ సూర్యనారాయణ, నరసరావుపేట సీఐ సోమయ్య పాల్గొన్నారు.

చివరి భూములకు నీరందించడమే లక్ష్యం

గురజాల, పిడుగురాళ్ల, దాచేపల్లి, న్యూస్‌టుడే: మేజర్ కాలువల మరమ్మతుల ద్వారానే చివరి భూములకు నీరందుతుందని, ఆ ఉద్దేశంతోనే రైతు కమిటీల ద్వారా పనులు చేయిస్తున్నట్లు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. పిడుగురాళ్ల పరిధిలోని ఆకురాజుపల్లె, దాచేపల్లి మండలం తంగెడ, గురజాల మండలం రామాపురం, దైద మేజర్ కాలువల్లో పూడికతీత పనులకు గురువారం శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యేతోపాటు ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు మేజర్లకు సంబంధించి 93.05 కిలోమీటర్ల పరిధిలో పనులు చేపట్టామన్నారు. 10 పొక్లెయిన్లతో పూడికతీత జరుగుతోందన్నారు. పనులు పూర్తయితే చివరి ఆయకట్టు భూములను నీరు అందుతుందని తెలిపారు. వైకాపా ప్రభుత్వ హయాంలో ఒక్క తట్ట మట్టి కూడా తీయలేదన్నారు. నిధులు మింగేసే ప్రభుత్వం వైకాపా అని, నిధులు రాకముందే పనులు చేసే మంచి ప్రభుత్వం తెదేపా అని ఆయన పేర్కొన్నారు. ఎంపీ మాట్లాడుతూ గత అయిదేళ్ల నిర్లక్ష్యానికి ఫలితంగా మేజర్లలో నీరు ముందుకు సాగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాలువలు కుచించుకుపోవడం, కంపచెట్లు మొలిచి ఇబ్బందిగా మారాయన్నారు. ఎమ్మెల్యే యరపతినేని చొరవ తీసుకుని పనులకు శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. గతంలో 450 కిలోమీటర్ల మేర పొలాలకు రోడ్లు నిర్మించినట్లు గుర్తు చేశారు. వర్షాలు తగ్గిన తర్వాత రోడ్ల నిర్మాణానికి యంత్రాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. పార్లమెంటు పరిధిలో 100 చెరువులను అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో నీటిపారుదలశాఖ ఈఈ శ్రీహరి, డీఈ మురళీధర్, వైద్యులు ఉన్నం నాగమల్లిఖార్జునరావు, యరపతినేని సాయినిఖిల్, నాయకులు లక్ష్మీనారాయణ, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, బొల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న ఎంపీ లావు, ఎమ్మెల్యే యరపతినేని, మాజీ ఎమ్మెల్సీ జంగా



కాలువలో పూడిక తీస్తున్న పొక్లెయిన్లు



సమావేశ మందిరంలో ఊడిన సీలింగ్



కింద పడిపోయిన మెటీరియల్

ఏడాదికే పైకప్పు పెచ్చులూడింది!

దెబ్బతిన్న ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరం

అచ్చంపేట, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వంలో అవినీతి, నిర్లక్ష్యానికి ఇదో నిదర్శనం. అచ్చంపేట ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరాన్ని గతేడాది వైకాపా ప్రభుత్వ హయాంలో ఆధునికీకరించారు. సీలింగ్, ఫ్యాన్లు, విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేశారు. వీడియో కాన్ఫరెన్స్ పరికరాలు అమర్చారు. ఎంపీడీవో కార్యాలయ భవనం పైకప్పు కొంత దెబ్బతింది. దీనికి మరమ్మతులు చేయకుండానే.. రూ.లక్షలు ఖర్చు చేసి సీలింగ్ వేశారు. గత నెలలో కురిసిన వర్షాలకు భవనం పైకప్పు పెచ్చులూడింది. సీలింగ్ కూడా ఊడిపడింది. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం అధికారులు ఇతర కార్యాలయాల్లో సమావేశాలు నిర్వహించాల్సి వస్తోంది.

పీఎం సూర్యఘర్‌పై అవగాహన తప్పనిసరి

మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట), న్యూస్‌టుడే : సౌర విద్యుత్తును ప్రతి ఇంటి చేరువ చేయాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం పీఎం సూర్యఘర్ ఉచిత విద్యుత్తు పథకం అందుబాటులోకి తెచ్చిందని ఎస్‌ఈ ప్రత్తిపాటి విజయ్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో విద్యుత్తుశాఖాధికారులకు పీఎం సూర్యఘర్‌పై అవగాహన కార్యక్రమం గురువారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పథకంతో ఇళ్లపై సౌర ఫలకలు ఏర్పాటు చేసుకుంటే కేంద్ర ప్రభుత్వం రాయితీతో పాటు విద్యుత్తు కొనే అవకాశం కల్పిస్తుందన్నారు. పథకంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. విద్యుత్తు భద్రతా ప్రమాణాలు పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ప్రసాద్, వెంకటేశ్వరరెడ్డి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌ఈ విజయ్‌కుమార్

వసతులు సమకూరిస్తే..

కల్తీ గుట్టు విప్పేస్తుంది!

- రూ. 10 కోట్లతో నిర్మించిన భవనాలు సిద్ధం
- ఇంతవరకు నామమాత్ర సేవలకే పరిమితం
- ఐదేళ్లూ పట్టించుకోని వైకాపా సర్కారు

ఈనాడు - నరసరావుపేట

వైకాపా పాలనలో చతికిలబడ్డ అనేక విభాగాల్లో గుంటూరులోని లాంఫామ్‌లో ఏర్పాటు చేసిన ఆహార పదార్థాల నాణ్యత ప్రయోగశాల ఒకటి..

ఉద్యాన విశ్వవిద్యాలయ ఆధ్వర్యంలో 2019 నాటికే రూ. 10 కోట్లతో భవనాల నిర్మాణం పూర్తయి.. అవసరమైన పరికరాలు సమకూరినా నాటి జగన్ ప్రభుత్వం నిధులివ్వలేదు. కనీసం నిర్వహణనూ పట్టించుకోలేదు. ఫలితం అది నామమాత్రపు పరీక్షలకే పరిమితమవ్వాల్సి వచ్చింది. వ్యవసాయ, ఉద్యాన, వాణిజ్య పంటల ఉత్పత్తులతోపాటు ఆహార పదార్థాల నాణ్యత నిర్ధారించడానికి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్రభుత్వ ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఏర్పాటు చేసిన మొదటి ప్రయోగశాల ఇది. పూర్తిస్థాయిలో అందుబాటులోకొస్తే ఆహార పదార్థాలు, పానీయాల నాణ్యతను పరీక్షించే వెసులుబాటు కలుగుతుంది. తద్వారా రైతులతోపాటు వ్యాపారులు, ఎగుమతి కంపెనీలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. దీన్ని నేషనల్ అక్రిడిటేషన్ ఫర్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ లేబొరేటరీస్ (ఎన్‌ఏబీఎల్) ప్రమాణాలకు అనుగుణంగా నిర్మించారు.

ప్రయోజనాలు ఎన్నెన్నో..

❖ అన్ని పదార్థాలు పరీక్షించి నాణ్యత ధ్రువపత్రాలిస్తారు. వీటి ఆధారంగా వ్యాపారులు వారి ఉత్పత్తులు విక్రయించుకోవచ్చు.

❖ పౌల్ట్రీ, డెయిరీ ఉత్పత్తులు, పండ్లు, కూరగాయలు, బిస్కెట్లు, బేకరీ ఉత్పత్తులు, తేనె, చక్కెరతో తయారైన పదార్థాలు, అన్ని రకాల కేకులు, చాక్లెట్లు, మద్యం, శీతలపానీయాలు, చిరుధాన్యాల ఉత్పత్తులు, వేరుశనగ, వాల్‌నట్స్, పచ్చళ్లు, చట్నీలు, గోరుచిక్కుడు, మొక్కలతో తయారైన ఔషధాలు, ఉద్యాన పంటల ఉత్పత్తులు, సుగంధ ద్రవ్యాలు, వ్యవసాయ, అనుబంధ ఉత్పత్తుల నాణ్యత పరీక్షిస్తారు.

❖ పురుగుమందుల అవశేషాల్లేని ఆహార పదార్థాలను గుర్తించడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది.

❖ చేపలు, రొయ్యలు, సముద్ర ఉత్పత్తుల నిల్వ, రవాణాలో హానికరమైన రసాయనాల వినియోగాన్ని తెలుసుకోవచ్చు.

రైతులకు ఉపయోగకరం

నాణ్యమైన ఆహార పదార్థాల ఎగుమతులను ప్రోత్సహించడానికి ప్రయోగశాల ఎంతగానో ఉపయోగపడుతుంది. కృష్ణా నుంచి మామిడికాయలు, గుంటూరు, కృష్ణా, అనంతపురం నుంచి కరివేపాకు పొడి, గుంటూరు నుంచి కారం పొడి తోపాటు వివిధ ప్రాంతాల నుంచి తాజా కూరగాయలు, చేపలు, రొయ్యలు ఎక్కువగా విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. వీటిని ఇక్కడి ప్రయోగశాలలో పరీక్షించి, ధ్రువపత్రం పొందితే అంతర్జాతీయ మార్కెట్లో మంచి ధర పొందడానికి వెసులుబాటు కలుగుతుంది. దీనివల్ల రైతులకు గిట్టుబాటు ధర దక్కే అవకాశం ఉంటుంది.

ఆర్థిక కష్టాలు తీరితేనే..

ప్రయోగశాల ఏర్పాటుకు కేంద్రం ఆర్‌కేవీవై కింద నిధులు మంజూరు చేసింది. గత వైకాపా ప్రభుత్వం కేంద్రానికి యూసీలు పంపకపోవడంతో నిధులాగిపోయాయి. ఈ ప్రభావం ప్రయోగశాల నిర్వహణపై పడింది. ప్రత్యేకంగా నిపుణులైన శాస్త్రవేత్తలు, సిబ్బందిని నియమించలేదు. ఉద్యాన వర్సిటీ పరిధిలోని శాస్త్రవేత్తలే నిర్వహణ చూస్తున్నారు. ప్రయోగశాలలో పని చేయాలంటే ప్రత్యేక శిక్షణతోపాటు ఆధునికంగా ఎప్పటికప్పుడు వస్తున్న మార్పులు, సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ పొందాల్సి ఉంటుంది. ఇవన్నీ పక్కాగా జరగాలంటే ప్రత్యేకంగా నిపుణులు, సిబ్బంది అవసరం. ఉద్యానవర్సిటీ నుంచి ప్రతిపాదనలు వెళ్లినా గత వైకాపా ప్రభుత్వం ఐదేళ్ల పాటు పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేసింది.

మానసిక ఆరోగ్యంతో సమస్యలు దూరం

నరసరావుపేట అర్బన్: మానసిక ఆరోగ్యం శరీరంపై ప్రభావం చూపుతుందని డీఎంహెచ్‌వో డాక్టర్ రవి పేర్కొన్నారు. ఏరియా ప్రభుత్వ వైద్యశాలలో గురువారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు.

> ఈపూరు మండలం గోపువారిపాలెంలో ఓ షేడ్‌నెట్ నిర్వాహకుడు నారు పోసేందుకు ప్రముఖ కంపెనీకి చెందిన మిరప విత్తనం పోలిన నకిలీ ప్యాకెట్ తెచ్చి రైతులను నమ్మబలికాడు. విషయం బయటకు పొక్కగా గత ఏడాది జులై 22న జిల్లా వ్యవసాయాధికారి మురళీ నేరుగా నర్సరీకి వాటిని వెళ్లి పట్టుకొని కేసు పెట్టారు.

> ఇదే మండలం ముప్పాళ్లకు చెందిన ఓ వ్యక్తి నాలుగేళ్ల క్రితం ఉప్పునకు రంగు వేసి పోటాషియం పేరుతో మార్కెట్‌లో విక్రయిస్తుండగా ప్రకాశం జిల్లాలో బయటపడింది. తర్వాత అతని సొంత ఊరిలో పెద్ద మొత్తంలో నిల్వలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

ప్యాకింగ్ మార్చి.. ఏమారుస్తారు

ఎరువులు, పురుగు మందుల చీకటి వ్యాపారం


పంట నష్టపోతున్న రైతులు

వినుకొండ, న్యూస్‌టుడే

మిరప పైరులో పురుగు నివారణకు వాడే ప్రముఖ సంస్థకు చెందిన డెలికేట్ మందు మార్కెట్‌లో రిటైల్ ధర రూ.1900 ఉంటే. . కొండ్రముట్లకు చెందిన ఓ రైతు బయట తక్కువ ఇస్తున్నారని రూ.1500కు కొన్నాడు. సీసా డీలరు వద్దకు తెచ్చి క్యూర్ కోడ్ స్కాన్ చేస్తే అది నకిలీ అని బయటపడింది.

☛ గిరాకీ ఉన్న ప్రముఖ సంస్థల పురుగు మందు పేరులో ఒక అక్షరం మార్చి తూకం ఒక ఎంఎల్ అదనంగా పెట్టి ప్యాకింగ్ అచ్చు గుద్దినట్లు తయారు చేసి చెట్టు పేరుతో కాయలు అమ్ముకున్నట్లు ఆ పేరుతో మార్కెట్‌లో అధిక లాభాలకు అమ్ముతున్నారు.

☛ విత్తనాలు.. ఎరువులు.. పురుగు మందులు కావేవి నకిలీకు అనర్హం అన్నట్లు మార్కెట్‌లో చలామణి అవుతున్నాయి. పత్తి, మిరప, కంది పంటలకు పురుగు మందుల వినియోగం ఎక్కువ. ఆయా ప్రాంతాల్లో ఏది అసలో ఏది నకిలీనో గుర్తించలేని పరిస్థితిని సృష్టించారు. పంటే సర్వస్వం అనుకుని బతికే రైతులు వాటిని వాడి నష్టపోతున్నారు. పట్టుబడినప్పుడు అధికారులు హడావుడి చేసి ఆనక వాటిని వదిలేస్తుండటంతో కొందరికి నకిలీ తయారీ మంచినీళ్లప్రాయంగా మారింది. ఉప్పునకు రంగేసి అమ్మిన వ్యాపారి, నకిలీ మిరప విత్తనాలు కొన్న షేడ్‌నెట్ నిర్వాహకుడిపై పెట్టిన కేసులు ఎక్కడున్నాయో తెలియదు. నమ్మకమైన డీలరు వద్ద కొంటే బిల్లు తీసుకోవాలని చెప్పినా కొందరు కాస్త తక్కువ ధరకు ఇస్తామని నమ్మబలికిన వారి వద్ద కొని నష్టపోతున్నారు.



గత ఏడాది జులై, 22న గోపువారిపాలెంలో అసలు పోలిన నకిలీ విత్తన ప్యాకెట్లను పట్టుకున్న జిల్లా వ్యవసాయాధికారి మురళీ

మహారాష్ట్ర నుంచి వినుకొండ వయా తెలంగాణ

తెలంగాణ సరిహద్దులోని మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాలు నకిలీ పురుగు మందుల తయారీ ఖిల్లాగా మారాయి. అక్కడకు వెళ్లి ప్రముఖ సంస్థలను పోలిన ఉత్పత్తులను ప్యాకింగ్ చేయించి వినుకొండ తెచ్చి అనుకూలమైన డీలర్లకు సరఫరా చేస్తున్నారు. అధిక లాభం, ఆకర్షణీయమైన బహుమతులు, విహార యాత్రల వలలో పడి వ్యాపారులు రైతులకు నచ్చజెప్పి అమ్ముతున్నారు. కొందరు గ్రామాల్లో తిరిగి అమ్ముతూ దీన్ని సంపాదనగా మార్చుకున్నారు. బయో ఉత్పత్తులే కాదు.. అసలుకు పోలిన నకిలీ పురుగు మందులు నేడు సాగుదారులను నట్టేట ముంచుతున్నాయి. వీటిపై వ్యవసాయశాఖ అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది.

జిల్లా గిరిజన సంక్షేమాధికారిగా జ్యోత్స్న

ఈనాడు డిజిటల్, నరసరావుపేట : జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిణిగా కె.జ్యోత్స్నను ప్రభుత్వం నియమించింది. ఈమె నెల్లూరు ఐటీడీఏ ఏపీఓ (అడ్మిన్)గా ప్రస్తుతం చేస్తున్నారు. అక్కడి నుంచి బదిలీపై జిల్లాకు వస్తున్నారు. ప్రస్తుతం జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిణి ఎల్.వరలక్ష్మి ప్రకాశం జిల్లాకు బదిలీ అయ్యారు. వీరికి ఇదివరకే బదిలీ అయినా డిప్యుటేషన్‌పై ఎక్కడివారు అక్కడే పని చేస్తున్నారు. అయితే ప్రస్తుతం డిప్యూటేషన్లు రద్దు చేస్తూ బదిలీలు జరిగిన చోటికి వెళ్లాల్సిందేనని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

కంటి సమస్యలపై అవగాహన కల్పించాలి

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే : కంటి సమస్యలతో వచ్చే దృష్టి లోపాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రవి పేర్కొన్నారు. ఏరియా ప్రభుత్వ వైద్యశాలలో గురువారం ప్రపంచ దృష్టి దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి చికిత్స అందించాలన్నారు. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ మంత్రునాయక్, డాక్టర్ హేమశ్రీ పిల్లల్లో వచ్చే దృష్టి దోషాలు, కారణాలు వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ చంద్రశేఖర్‌పాల్, ఏడు కొండలు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైకాపా మాజీ ఎమ్మెల్యే పీఏకి రాచ మర్యాదలు



మాజీ ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శితో దగ్గరుండి హోమం (క్రతువు) చేయిస్తున్న ఈవో వేమూరి గోపి

అమరావతి, న్యూస్‌టుడే: వైకాపా అధికారం కోల్పోయినా.. ఆ పార్టీ నాయకులపై కొందరికి స్వామి భక్తి ఏమాత్రం తగ్గడం లేదు. గురువారం పంచారామ క్షేత్రం అమరావతిలో వైకాపా మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు వ్యక్తిగత కార్యదర్శి సత్తి రాజుకు ఆలయ అధికారులు రాచమర్యాదలు చేశారు. ఈవో వేమూరి గోపి ఆయనకు స్వాగతం పలికి, దగ్గరుండి దర్శనం చేయించారు. అంతకుముందు నవగ్రహాల సందర్శనం చేపట్టిన చండీహోమం వద్ద పీఏ దంపతులను కూర్చోబెట్టి ఈవో క్రతువులు చేయించారు. అనంతరం వెంకటేశ్వర నాయుడు మండపంలో తీవారి పరిచి వేద పండితులతో ఆశీర్వచనాలు ఇప్పించారు. మాజీ ఎమ్మెల్యే పీఏకి రాచమర్యాదలు కల్పించడంపై విమర్శలు వస్తున్నాయి.

ముత్యాలమ్మకు జన నీరాజనం

మాచర్ల (కారంపూడి), వెల్దుర్తి, న్యూస్‌టుడే: మాచర్ల మండలం ముత్యాలమ్మపాడు గ్రామంలో ముత్యాలమ్మ జాతర ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారి సిడిమాను ఊరేగింపు కనులపండువగా సాగింది. జోరు వానలోనూ భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మాచర్ల, గిద్దలూరు ఎమ్మెల్యేలు జూలకంటి బ్రహ్మారెడ్డి, అశోక్‌రెడ్డి హాజరై వేడుక తిలకించారు.



సిడిమాను ఊరేగింపులో భక్తులు

ఎస్టీయూ (డి) ఆవిర్భావ దినోత్సవం

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే : ప్రకాశ్‌నగర్‌లోని చదలవాడ కృష్ణయ్య భవన్‌లో గురువారం ఎస్టీయూ(డి) ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయ సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు కొమెర లూథర్ 23 వర్ధంతి కలిపి నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంగం కోటేశ్వరరావు తదితరులు లూథర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సంఘం ఏర్పాటు లక్ష్యాలను వివరిస్తూ, లూథర్ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ పింఛనుదారుల సంఘ అధ్యక్షుడు మానం సుబ్బారావు, బెల్లంకొండ తోమసయ్య, సంఘ జిల్లా అధ్యక్షుడు అరుణ్‌రావు, లూథర్ కుమార్తెలు క్రాంతి, జ్యోతి, ప్రగతి సీనియర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు 1828 దరఖాస్తులు

నరసరావుపేట టౌన్, న్యూస్‌టుడే : జిల్లాలోని 129 మద్యం దుకాణాలకు గురువారం రాత్రికి 1828 దరఖాస్తులు చేశారని అబ్కారీ శాఖ ఈఎస్ మణికంఠ తెలిపారు. పొడగించిన గడువు మేరకు శుక్రవారం రాత్రి 7 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన సూచించారు.

గోవిందపురంలో భారీ చోరీ

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే : మండలంలోని గోవిందపురంలో బుధవారం అర్ధరాత్రి భారీ చోరీ జరిగింది. గ్రామానికి చెందిన అబ్బూరి హనుమయ్య ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు తలుపులు పగలగొట్టి బీరువాలోని 180 గ్రాముల బంగారం, 1300 గ్రాముల వెండి, రూ. 50 వేలు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఊసే లేని జనరిక్ మందుల దుకాణాలు

కారుమంచి (శావల్యాపురం), న్యూస్‌టుడే : గతంలో శావల్యాపురం సహకార సంఘ పరిధిలోని వేల్పూరు, శావల్యాపురం, కారుమంచి పరిధిలో కారుమంచిలో జనరిక్ మందుల దుకాణాల ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేశారు. 8 నెలలు గడుస్తున్నా పనులు కాలేదు. అప్పట్లో సొసైటీ ఇన్‌ఛార్జులుగా ఉన్న వారికి దిల్లీలో నిర్వహించిన జన ఔషధ్ కార్యక్రమంలో భాగంగా దుకాణం అనుమతికి సంబంధించిన ధ్రువపత్రాలు అందజేశారు. ఇందుకు కావాల్సిన గదిని కూడా జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టరు స్థాయిలోని అధికారులు పరిశీలించి, ఏర్పాటుకు సమ్మతి తెలిపారు. జనరిక్ దుకాణాలు ఏర్పాటు చేస్తే తక్కువ ధరకు నాణ్యమైన మందులు అందుబాటులోకి వస్తాయని ప్రజలు ఆశించారు. తర్వాత సార్వత్రిక ఎన్నికలు జరగడం, ప్రభుత్వం మారడం తదితర కారణాలతో వీటి గురించి ఎవరూ పట్టించుకోలేదు. బుధవారం నరసరావుపేటలో కలెక్టర్ పి. అరుణ్‌బాబు జనరిక్ ఔషధ దుకాణాల ఏర్పాటు, పెట్రోలు బంకుల నిర్మాణం తదితర వాటిపై సమీక్ష నిర్వహించి, త్వరలో ఏర్పాటు చేయాలని సొసైటీ సిబ్బందిని ఆదేశించారు. ఈ నేపథ్యంలో అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది.

కుండపోత వర్షం.. కాలనీలు జలమయం



సత్తెనపల్లి రోడ్డు నుంచి పల్నాడు రోడ్డు వెళ్లే మార్గంలో చెరువును తలపిస్తున్న రహదారి

మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట), న్యూస్‌టుడే : పట్టణంలో గురువారం కుండపోత వర్షం కురిసింది. వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మురుగు కాలువలు పొంగి పొర్లాయి. పట్టణంలోని సత్తెనపల్లి రోడ్డు నుంచి పల్నాడు రోడ్డు వెళ్లే మార్గంలో రహదారి చెరువును తలపించింది. పలు కాలనీల్లో మట్టిరోడ్లు బురదమయమై స్థానికులు నడవలేకపోయారు. వర్షం అధికమవడంతో పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

'ఆలపాటిని అఖండ మెజార్టీతో గెలిపించాలి'

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే: ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను భారీ ఆధిక్యంతో గెలిపించాలని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పిలుపునిచ్చారు. చిలకలూరిపేట ప్రత్తిపాటి గార్డెన్స్‌లో ఎమ్మెల్యే ప్రత్తిపాటి ఆధ్వర్యంలో గురువారం రాత్రి తెదేపా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. అనంతరం అర్హులైన పట్టభద్రుల ఓటు నమోదుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, తెదేపా, జనసేన, భాజపా నాయకులు పాల్గొన్నారు.

నరసరావుపేట

•నరసరావుపేట • వినుకొండ • చిలకలూరిపేట

డిసెంబరు 14న జాతీయ లోక్ అదాలత్

నరసరావుపేట లీగల్, న్యూస్‌టుడే : రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో డిసెంబరు 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, 13వ అదనపు జిల్లా న్యాయాధికారి ఎన్.సత్యశ్రీ తెలిపారు. ఇందులో రాజీమార్గంలో కేసులు పరిష్కరిస్తారని, కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదాలత్‌లో సివిల్, రాజీపడే క్రిమినల్, బ్యాంకు, రెవెన్యూ, మోటారు వాహన ప్రమాద కేసులు పరిష్కరించుకోవచ్చని ఆమె సూచించారు.

హతవిధీ.. ఆసుపత్రి

● విద్యుత్తు పోతే ఉక్కపోత ● భవనం చుట్టూ మురుగు బాధ

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే

చిలకలూరిపేట ప్రాంతీయ ప్రభుత్వ ఆసుపత్రిలో పర్యవేక్షణ లోపంతో సమస్యలు వెంటాడుతున్నాయి. 100 పడకల ఆసుపత్రి కావడంతో సుదూర ప్రాంతాల నుంచి మెరుగైన వైద్యం కోసం ప్రతిరోజు 350 మంది దాకా వస్తుంటారు. ప్రసూతి విభాగంలో ప్రసవానంతర వార్డులో 27 మంచాలు ఉన్నాయి. వీటిలో బాలింతలు ఉన్నారు. విద్యుత్తు సరఫరా ఆగిన సమయంలో శిశువులకు గాలి ఆడక విసనకర్రలతో విసురుతున్నారు. ఆసుపత్రిలో ఉండి వైద్యం చేయించుకునేవారు, బాలింతలు, గర్భిణులు విద్యుత్తు సరఫరా లేని సమయంలో ఇబ్బంది పడుతున్నారు. కాన్పుల విభాగం పక్కన మురుగు నిల్వ ఉంది. దీనివల్ల దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. ఆసుపత్రి పాత భవనంలో ఐసీటీసీ విభాగం ఎదురు హాలులో ఏసీల నుంచి వచ్చే నీటి కోసం డబ్బా ఏర్పాటు చేశారు. అది నిండి హాలు లోపల ఫ్లోర్ తడుస్తోంది. రోగులు, సిబ్బంది లేకపోయినా ఫ్యాన్లు తిరుగుతున్నాయి. అటుగా వచ్చిన వారు ఈ పర్యవేక్షణ లోపాన్ని విమర్శిస్తున్నారు. ఆసుపత్రి ఆవరణలో పిచ్చి చెట్లు, వ్యర్థాలు ఉన్నాయి. మురుగునీటి వ్యవస్థ లేకపోవడం, ఆసుపత్రి చుట్టూ ప్రహరీ లేక రోగులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. సంబంధిత అధికారులు సమస్యలు పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.



ఆసుపత్రి ఆవరణలో వ్యర్థాలు



విద్యుత్తు సరఫరా నిలిచి శిశువుకు విసనకర్రతో విసురుతూ..



కాన్పుల విభాగం పక్కన మురుగునీటి తటాకం



గంటావారిపాలెంలో దుర్గాదేవిగా



శావల్యాపురంలో దుర్గాదేవిగా అమ్మవారు



రవ్వారం జగన్మాత పీఠంలో దుర్గాదేవిగా అమ్మవారు



జెడ్డావారిపాలెంలో దుర్గాదేవిగా



దుర్గాదేవిగా రొంపిచర్ల శ్రీవాసవీ అమ్మవారు



దుర్గమ్మ అలంకరణలో విప్పర్ల కామాక్షి



చిలకలూరిపేట : శారదాంబ దేవాలయంలో

కరుణించు కనకదుర్గ

న్యూస్‌టుడే, బృందం : జిల్లాలో దసరా నవరాత్రి ఉత్సవాలు వేడుకగా సాగుతున్నాయి. గురువారం శక్తిస్వరూపిణి అయిన అమ్మవారు కనకదుర్గ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాలకు భక్తులు వచ్చి.. అమ్మవారికి పూజలు చేస్తున్నారు.



చిలకలూరిపేట: కనకదుర్గమ్మ ఆలయంలో



గణపవరం గండి పోచమ్మ ఆలయంలో



ముప్పాళ్లలో శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి



విఠంరాజుపల్లిలో దుర్గాదేవిగా



పాతూరులో దుర్గాదేవిగా పార్వతీదేవి



రామిరెడ్డిపేటలో దుర్గాదేవిగా బాలచౌడేశ్వరి



అరండల్‌పేట సత్యసాయి మందిరంలో దుర్గాదేవి అలంకరణ

వెలగని దీపాలు.. చీకట్లో చిక్కులు

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే : పట్టణంలో అనేక ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా సత్తెనపల్లి రోడ్డు సాయినగర్ ప్రాంతంలో రాత్రివేళ చిమ్మ చీకటిగా ఉంటోంది. అలాగే వినుకొండ రోడ్డు, కోటప్పకొండ రోడ్డులో రాత్రి పది దాటాక వీధి దీపాలు ఆగిపోతున్నాయి. ఎందుకు నిలిపివేస్తున్నారో అర్థం కాక వాహనదారులు, ప్రజలు తల పట్టుకుంటున్నారు. ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కరించటం లేదని వాపోతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించాలని కోరుతున్నారు.



అంధకారంగా సత్తెనపల్లి రోడ్డు సాయినగర్ ప్రాంతం

పొలాల్లో మోటారు రాగితీగ చోరీలు

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే : పొలాల్లో విద్యుత్తు సబ్‌మెర్సిబుల్ మోటార్లకు ఏర్పాటు చేసే రాగితీగ పది రోజుల వ్యవధిలో 40 చోట్ల చోరీకి గురైనట్లు మురికిపూడి, గంగన్నపాలెం గ్రామాల రైతులు వాపోతున్నారు. పొలంలో బోరు లోపల వరకు రాగితీగ 70 నుంచి 100 మీటర్ల వరకు ఉంటుందని, ఇది మీటరు రూ. 80 నుంచి రూ. 110 వరకు ఉంటుందని చెప్పారు. ఒకసారి చోరీకి గురైతే రైతులకు పనులు నిలిచి రూ. 15 వేల వరకు నష్టం వాటిల్లుతుందని ఆదినారాయణ, చందు వాపోయారు. ప్రతిరోజు చోరీలు జరుగుతున్నా పోలీసులు దృష్టి సారించడం లేదని చెప్పారు. ఇప్పటికైనా ప్రతి గ్రామానికి కేటాయించిన పోలీస్ ఇలాంటి వాటిపై నిఘా పెట్టి దొంగలను పట్టుకోవాలని వారు కోరారు.

డీఏఆర్ ఏఎస్పీగా సత్తిరాజు

నరసరావుపేట టౌన్, న్యూస్‌టుడే : జిల్లా అదనపు (ఏఆర్) ఎస్పీగా వి.సత్తిరాజు నియమితులయ్యారు. అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి ఆయన్ని ఇక్కడికి బదిలీ చేశారు. ఇప్పటి వరకు ఈ స్థానంలో పనిచేస్తున్న రామచంద్రరాజును విజయనగరం పోలీసు శిక్షణ కళాశాలకు బదిలీ చేశారు.

జాతీయ స్థాయి ఆట్యాపాట్యా పోటీలకు ఎంపిక

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే : పాండిచ్చేరిలో 11, 12, 13 తేదీల్లో నిర్వహించే జాతీయ స్థాయి సబ్ జూనియర్ ఆట్యాపాట్యా పోటీలకు లింగంగుంట్ల శంకరభారతీపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం పార్వతి తెలిపారు. ముగ్గురు బాలికలు, నలుగురు బాలురు పోటీలకు ఎంపికయ్యారన్నారు. వీరికి వ్యాయామ ఉపాధ్యాయిని ఝాన్సీరాణి, షేక్ ఫాతిమ, పి.తిరుపతిరావు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

పీఎంశ్రీ ఆన్‌లైన్ పోటీలకు విద్యార్థులు

రొంపిచర్ల, న్యూస్‌టుడే : పీఎంశ్రీ 25 రోజుల కార్యక్రమంలో భాగంగా మండలంలోని వి.రెడ్డిపాలెం పీఎంశ్రీ ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు గురువారం స్థానిక స్థలాల విశిష్టతపై ఆన్‌లైన్ క్విజ్ పోటీలకు హాజరైనట్లు ప్రిన్సిపల్ డాక్టర్ బి.రవినాయక్ తెలిపారు. ఇలాంటి పోటీల ద్వారా విద్యార్థులకు జిల్లాలోని స్థానిక ముఖ్య ప్రదేశాలపై అవగాహన పెరుగుతుందని చెప్పారు. ప్రముఖ కట్టడాల ప్రాచీనత, సంప్రదాయాలు, సంస్కృతి, పురాతన పురాణ నామాలను తెలుసుకోవటానికి అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

రాష్ట్ర పోటీలకు...

వినుకొండ, న్యూస్‌టుడే : వినుకొండకు చెందిన నలుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలకు ఎంపికయ్యారని శిక్షకుడు శర్మ తెలిపారు. 7, 8 తేదీల్లో మంగళగిరిలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలలో తనీష్, మహ్మద్, పవన్, వెంకటరెడ్డి సత్తా చాటారని చెప్పారు. వచ్చేనెలలో కాకినాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. గురువారం విజేతలను కారంపూడి రోడ్డులోని ఓ ప్రైవేటు స్పోర్ట్స్ అకాడమీలో సన్మానించారు.

దసరా తర్వాత రోడ్లకు పండగే



శిలాఫలకం వద్ద ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, అధికారులు, తెదేపా నేతలు

యడ్లపాడు, న్యూస్‌టుడే : దసరా నుంచి రాష్ట్రంలో గ్రామాల మధ్య రహదారులు, అంతర్గత రోడ్లకు మహర్దశ పట్టనుందని తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. యడ్లపాడు మండలం వంకాయలపాడులోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలకు సీసీ రోడ్డు నిర్మాణానికి గురువారం ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. రాష్ట్రంలో పాడైన రోడ్ల బాగుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాన్ నేతృత్వంలో నిధులు కేటాయించినట్లు తెలిపారు. గురుకుల పాఠశాలకు మెరుగైన రోడ్డు మార్గం ఏర్పాటు చేస్తామని గతంలో ఇచ్చిన హామీని అమలు చేస్తున్నట్లు తెలిపారు. తెదేపా నేతలు కామినేని సాయిబాబు, కందిమళ్ల రఘురామారావు, కుర్రా రత్తయ్య, మద్దినేని వెంకటసుబ్బారావు, ఎంపీడీవో హేమలతదేవి, డిప్యూటీ తహసీల్దార్ అనురాధ పాల్గొన్నారు.

చిన్నారికి సీఎం సహాయనిధి సాయం

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే : తలసేమియాతో బాధపడుతున్న చిన్నారి వైద్య ఖర్చులకు ప్రభుత్వం తరఫున సీఎం సహాయ నిధి నుంచి వచ్చిన రూ. 10 లక్షల సాయాన్ని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు గురువారం బాధిత చిన్నారి కుటుంబానికి అందించారు.


'వరద సాయంపై జగన్ దుష్ప్రచారం'

వినుకొండ రూరల్, బొల్లాపల్లి, న్యూస్‌టుడే : ఇటీవల విజయవాడ వరద బాధితులను ఆదుకోవడానికి ప్రభుత్వం ఖర్చు చేసిందే రూ. 203 కోట్లు అయితే రూ. 534 కోట్లు దోపిడీ ఎలా సాధ్యమైందో చెప్పాలని జగన్‌రెడ్డి, వైకాపా నేతలను ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ప్రశ్నించారు. గురువారం ఎంపీపీ శ్రీరాములు అధ్యక్షతన జరిగిన బొల్లాపల్లి మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నాడు వరద బాధితులను ఆదుకోవడానికి చేతులు రాని జగన్.. సాయంపై మాత్రం పని గట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజాప్రతినిధులు లేవనెత్తిన పారిశుద్ధ్యం, విద్యుత్తు తీగల సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని ఆదేశించారు. పలు సమస్యలపై చర్చించి శాఖల వారీగా అధికారులకు ఎమ్మెల్యే దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో ఎంపీడీవో జిలానీబాష, తహసీల్దార్ సుధాకర్, జడ్పీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

వినుకొండ : త్వరలో జరగనున్న కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో యువత కొట్టే దెబ్బకు వైకాపా మళ్లీ లేవకూడదని శాసనసభ్యుడు జీవీ ఆంజనేయులు కోరారు. తన కార్యాలయంలో గురువారం పట్టభద్రుల ఓటు నమోదుకు దరఖాస్తులను ఆయన పంపిణీ చేశారు. పార్టీ ఎన్నికల పరిశీలకులు పి.భూపతిరావు, పి.శ్రీనివాసరావు, ఎన్.శ్రీనివాసరావు, రఘురావునాయుడు, సైదారావు, రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.



మణిదీప పూజ చేస్తున్న హిమాలయ గురూజీ

కొనసాగుతున్న రాజశ్యామల యాగం

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే : రోజుకొక ప్రత్యేక పూజ చొప్పున తొమ్మిది రోజుల పాటు పూజలు నిర్వహిస్తున్నట్లు శాంతి ఆశ్రమ ట్రస్టు సభ్యులు తెలిపారు. విఠంరాజుపల్లిలోని ఆశ్రమం వద్ద హిమాలయ గురూజీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవీ నవరాత్రుల్లో భాగంగా ఏడోరోజు గురువారం అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. గురూజీ మణిదీప, దుర్గా పూజలు నిర్వహించి, రాజశ్యామల యాగం చేశారు. 1008 కలశాలతో నిర్వహించిన ప్రత్యేక పూజ ఆకట్టుకుంది. 12న విజయదశమి నాడు అన్నదానం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.


రైతులకు ఎరువుల పంపిణీ

శావల్యాపురం, న్యూస్‌టుడే : రైతు సేవా కేంద్రాల ద్వారా మండలంలోని రైతులకు ఎరువులు అందజేస్తున్నామని మండల వ్యవసాయాధికారి రామినేని రామారావు తెలిపారు. గురువారం మండలంలోని వేల్పూరు రైతు సేవా కేంద్రం మినహా మిగిలిన అన్ని చోట్లా ఒక్కొక్క దానికి 10 టన్నులు చొప్పున 100 డీఏపీ, యూరియా అందుబాటులో ఉందని పేర్కొన్నారు. వేల్పూరులో సహకార సంఘానికి కేటాయించి నందున రైతు సేవా కేంద్రానికి మంజూరు చేయలేదని తెలిపారు. అనంతరం శావల్యాపురం సేవా కేంద్రం వద్ద రైతులకు ఎరువులు అందజేశారు. కార్యక్రమంలో ఏఈవో పూరేటి అశోక, సిబ్బంది వెంకాయమ్మ, రైతులు పాల్గొన్నారు.

ఆ మృతదేహం శానంపూడి వాసిది

మార్టూరు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని ఏబీసీ కాల్వలో బయటపడిన మృతదేహం పల్నాడు జిల్లా శావల్యాపురం మండలం శానంపూడి వాసిదిగా మార్టూరు పోలీసులు గుర్తించారు. బుధవారం జంగమహేశ్వరపురం సమీపంలోని సాగర్ కాల్వలో 34 ఏళ్ల వ్యక్తి మృతదేహం కొట్టుకొచ్చిన విషయం తెలిసిందే. గుర్తుతెలియని మృతదేహంగా భావించిన మార్టూరు పోలీసులకు శావల్యాపురం పోలీసులు మృతుడు అమృతపూడి నాగేశ్వరరావుగా తెలిపారు. ఈ నెల 7న నాగేశ్వరరావు కనిపించకుండా వెళ్లినట్లు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అక్కడి స్టేషన్‌లో కేసు నమోదైనట్లు తెలిపారని మార్టూరు పోలీసులు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి



మంత్రి సంధ్యారాణికి వినతిపత్రం అందిస్తున్న మండల నేతలు

నూజండ్ల: మండలంలోని కమ్మవారిపాలెం ఎస్టీకాలనీలో ఇళ్లు లేక గుడారాలు వేసుకుని జీవిస్తున్నారని, వర్షం కురిస్తే ఆ ప్రాంతం నీటితో నిండగా వారిని పాఠశాలలోకి తీసుకెళ్లి ఆహారం అందించామని.. వారి సమస్యలు పరిష్కరించాలని తెదేపా మండల నేతలు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణిని రాజధానిలో కలిసి వినతి పత్రం అందజేశారు. కాలనీకి మెరక తోలి ఇళ్ల నిర్మాణాలు మంజూరు చేయించి నిర్మించాలని, తాగునీటి వసతి కల్పించాలని కోరారు. వారికి ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు, ఓటు హక్కు లేకపోవడాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు, ఇటీవల ఎస్టీ కమిషన్ సభ్యుడు వచ్చి చూశారని, కలెక్టర్‌కు గుడారాల చిత్రాలు చూపగా ఆశ్చర్యం వ్యక్తం చేసి ఇంకా ఇలాంటి పరిస్థితులు, ఇళ్లు ఉన్నాయా అని అడిగారన్నారు. అన్ని సమస్యలు పరిష్కరిస్తానని నేతలకు మంత్రి హామీ ఇచ్చారు. ఆమెను కలిసిన వారిలో ముండ్రు సుబ్బారావు, గంగినేని బాబు, చంద్రశేఖర్, నరేష్ ఉన్నారు.

అటవీజాతి మొక్కల పెంపకంతో అదనపు ఆదాయం



అటవీ మొక్కల పెంపకం గురించి వివరిస్తున్న అధికారులు

ఈపూరు, న్యూస్‌టుడే : మండలంలోని అగ్నిగుండాలలో గురువారం అటవీయేతర ప్రాంతాల్లో చెట్ల పెంపకంపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆగ్రో ఫారెస్ట్రీ మీద అవగాహన కల్పించారు. వ్యవసాయ భూముల్లో ఉద్యాన, అడవి జాతి మొక్కలు పెంచడం వల్ల అదనపు ఆదాయం వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో టీవోఎఫ్ఐ ప్రోగ్రాం సమన్వయకర్త వెంకటేష్, వీహెచ్ఏ జి.యతేంద్ర నాగరాజు పాల్గొన్నారు.

వార్డు సభ్యుల భాగస్వామ్యంతోనే అభివృద్ధి



సూచనలు చేస్తున్న ఎంపీడీవో ఉమాదేవి

నూజండ్ల, న్యూస్‌టుడే : వార్డు సభ్యులకు పంచాయతీల్లో భాగస్వామ్యం ఉందని, సమావేశంలో ప్రతి సభ్యుడి సలహా తీసుకోవాలని, దానికనుగుణంగా అభివృద్ధి పనులు చేస్తారని ఎంపీడీవో ఉమాదేవి అన్నారు. ఉప సర్పంచి, వార్డు సభ్యులకు మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. పంచాయతీలో జరిగే అభివృద్ధి పనుల్లో సభ్యులకు కూడా భాగస్వామ్యం ఉంటుందని, గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈవోపీఆర్డీ రవికుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వినుకొండ రూరల్ : వార్డు సభ్యులు గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని, తమ గ్రామాలను ఉన్నతంగా తీర్చిదిద్దడానికి సహకారం అందించాలని ఈవోపీఆర్డీ సుందరరెడ్డి అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రతి పంచాయతీ నుంచి ఉప సర్పంచులు, ఒక మహిళా, ఒక పురుష వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో పుట్టా రెడ్డి, రిసోర్స్ కో-ఆర్డినేటర్ ప్రభాకరరావు, కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే : ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి వారమైనా తిరిగి రాకపోవడంపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. శ్రీకాకుళానికి చెందిన ఏరోతు చిరంజీవులు తన గ్రామానికే చెందిన బంధువు దుమ్మడి కుర్మారావుతో కలిసి వినుకొండలోని ఏనుగుపాలెం రోడ్డులో ఉన్న హనుమంతరావు టింబర్ డిపోలో పని చేసేవారు. 2న ఇంటి నుంచి బయటకు వెళ్లిన చిరంజీవులు తిరిగి రాలేదు. దీంతో కుర్మారావు పోలీసులకు ఫిర్యాదు చేయగా అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్సై స్వర్ణలత తెలిపారు.

పల్లె పండగ విజయవంతం చేయాలి

శావల్యాపురం : 14 నుంచి నిర్వహించే పల్లె పండగ విజయవంతం చేయాలని ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య తెలిపారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో మినీ గోకులం లబ్ధిదారులు, క్షేత్ర సహాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి మొత్తం 22 మినీ గోకులాలు మంజూరయ్యాయని, వీటిలో ఆరు, నాలుగు, రెండు, గొర్రెలు, మేకల షెడ్ల సామర్థ్యాన్ని బట్టి ప్రభుత్వం ప్రోత్సాహకం ఇస్తుందని చెప్పారు.

ఉద్యమం తీవ్రతరం చేస్తాం

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే : కారణం లేకుండా మున్సిపల్ ఒప్పంద కార్మికులు, ఉద్యోగులను విధుల నుంచి తొలగించారని, విధుల్లోకి తీసుకోవాలని ఎంసీపీఐయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మొహిద్దీన్ బాషా డిమాండ్ చేశారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఒప్పంద కార్మికుల ఆందోళనకు ఆయన ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఉద్యోగులను, కార్మికులను తొలగించడం పద్ధతి కాదని చెప్పారు. వారిని విధుల్లోకి తీసుకోకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సీఐటీయూ జిల్లా గౌరవాధ్యక్షుడు సిలార్ మసూద్ తదితరులు పాల్గొన్నారు.

రతన్ టాటాకు అశ్రు నివాళి

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే : ప్రముఖ పారిశ్రామికవేత్త, టాటా గ్రూప్ సంస్థల ఛైర్మన్ రతన్ టాటా మృతికి పలువురు సంతాపం తెలిపారు. తెదేపా జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, ఎమ్మెల్యే అరవింద బాబు, మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి వేర్వేరుగా సంతాపం తెలిపారు.

సత్తెనపల్లి

• సత్తెనపల్లి • పెదకూరపాడు • మాచర్ల • గురజాల

దసరా వేడుకలకు రూ.లక్ష విరాళం


చెక్కు అందజేస్తున్న పరాశక్తి అధికారులు

రెంటచింతల, న్యూస్‌టుడే: పల్నాట పురాతన పుణ్యక్షేత్రం సత్రశాలలో దసరా సంబరాలకు పరాశక్తి సిమెంట్ పరిశ్రమ యాజమాన్యం రూ.లక్ష చెక్కు అందజేశారు. ఈవో రామిరెడ్డి మాట్లాడుతూ దాతల సహకారంతో ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.

మల్లాది ఇసుక రీచ్ పరిశీలన

అమరావతి, న్యూస్‌టుడే: ఈనెల 15 నుంచి ఇసుక రీచ్‌లు ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో మల్లాది ఇసుక రీచ్‌ను ఆర్డీఓ రమణకాంత్‌రెడ్డి గురువారం పరిశీలించారు. పొందుగల, మల్లాది, దిడుగు గ్రామాల సరిహద్దుల్లోని ఇసుక నిల్వలను ఆయన తనిఖీ చేశారు. ఆ మూడు ప్రాంతాల నుంచి ఇసుక తవ్వకాలు జరిపి, డంపింగ్ యార్డుకు తరలించనున్నారు. ఈ మేరకు డంపింగ్ యార్డు కోసం వాహనాలకు అనువుగా ఉండే స్థలాలను పరిశీలించారు. తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


డంపింగ్ యార్డుకు స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ రమణకాంత్‌రెడ్డి

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

సత్తెనపల్లి: 80085 73171 పెదకూరపాడు: 80088 31888
మాచర్ల గ్రామీణ: 80085 73181 గురజాల: 80085 7 3176

సమస్య: అమరావతి గోపాల్‌నగర్‌లోని సీపీఎం కార్యాలయం సమీపంలో సీసీ రహదారిపై మురుగు నీరు ప్రవహిస్తోంది. నడవడానికి ఇబ్బంది పడుతున్నాం. **- బి.సూరిబాబు**

సమాధానం: పంచాయతీ కార్యదర్శిని పంపించి సమస్యను గుర్తించి, పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం.
- పద్మజ, ఈఓపీఆర్డీ **- న్యూస్‌టుడే, అమరావతి**

సమస్య: స్థానిక వీరభద్రస్వామి కాలనీ రెండో లైన్‌లో మురుగు నీరు రోడ్డుపైనే నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా ఉంది.
- జి.రవి, కాలనీవాసి, అచ్చంపేట

సమాధానం: కాలనీలో అంతర్గత రహదారులు నిర్మించేందుకు, మురుగు ఉన్నచోట గ్రావెల్ తోలేందుకు చర్యలు తీసుకుంటాం.
- పంతులునాయక్, కార్యదర్శి **- న్యూస్‌టుడే, అచ్చంపేట**

సమస్య: గురజాల మండలంలోని అన్ని గ్రామాల్లో కుక్కలు, కోతుల బెడద తీవ్రంగా ఉంది. **- మాడుగుల, దైద గ్రామస్థులు**

సమాధానం: కుక్కలకు టీకాలు వేయిస్తాం. కోతులను గ్రామాలకు దూరంగా తరలించేందుకు చర్యలు తీసుకుంటాం.
- జయరామ్‌నాయక్, ఈవోఆర్డీ, గురజాల
- న్యూస్‌టుడే, గురజాల గ్రామీణ

పండగ వేళ.. ధరల మోత

సత్తెనపల్లి, న్యూస్‌టుడే



ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలతో కూరగాయల పంట దెబ్బతింది. దిగుబడి తగ్గి.. వాటి ధరలు చుక్కలనంటుతున్నాయి. రోజురోజుకు ధరలు పెరగడమేకానీ తగ్గట్లేదు. గతంలో రూ.వంద తీసుకెళ్తే ఐదారు రకాల కూరగాయలు సంచిలోకి చేరేవి. ఇప్పుడు ఒకటి, రెండు కూడా రాని పరిస్థితి. ధరల దరువుతో సామాన్యుడు అల్లాడుతున్నాడు. సత్తెనపల్లి పట్టణంలోని రాజీవ్‌గాంధీ కూరగాయల మార్కెట్‌కు రోజూ వందలమంది వినియోగదారులు వస్తుంటారు. ధరలు పెరిగిన నేపథ్యంలో వారు ఆచితూచి కొనుగోలు చేస్తున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. మరి కొన్ని రోజుల వరకు ధరలు తగ్గే అవకాశం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



- గత నెల 9న టమాటా కిలో రూ.30 కాగా. ఇప్పుడు రూ.80 పలుకుతోంది. రిటైల్‌కు చేరే సరికి వందకు చేరుకుంటుంది. చిత్తూరు జిల్లా మదనపల్లి మార్కెట్ నుంచి టమాటా వస్తోంది. అక్కడే 25 కిలోల బాక్స్ ధర రూ.2 వేలు వరకు ఉందని వ్యాపారులు చెబుతున్నారు.
- నాలుగైదు రోజులుగా చిక్కుళ్లు మార్కెట్‌కు వస్తున్నాయి. తొలి పంటకే అవి కిలో రూ.100 పలుకుతున్నాయి. దిగుబడి తక్కువగా ఉండటమే అందుకు కారణమని వ్యాపారులు చెబుతున్నారు. సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లోని తోటల్లో చిక్కుడు పండిస్తున్నారు.
- ప్రస్తుతం కూరగాయల్లో చాలావరకు కిలో రూ.40 నుంచి రూ.60 వరకు ఉన్నాయి. బెండ, దొండకాయలు రూ.60, వంకాయ రూ.40, దోస రూ.40, కాకర రూ.50తో విక్రయిస్తున్నారు. గత నెల అవే కూరగాయలు రూ.20 నుంచి రూ.30లోపే ఉన్నాయి. ఉల్లిపాయల ధరలు మండిపోతున్నాయి.

దడ పుట్టిస్తున్నాయ్



కూరగాయల ధరలు దడ పుట్టిస్తున్నాయి. మార్కెట్ వెళ్లి కావాల్సినవి కొనుగోలు చేయాలంటే ఒకటికి రెండు సార్లు ఆలోచించాల్సి వస్తోంది. టమాటా ధర సామాన్యుడికి అందనంతగా ఉంది. పేద, మధ్యతరగతి కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయి. **- సాయి, వినియోగదారుడు**

ధరలు అదుపు చేయాలి



కూరగాయల ధరలు మండిపోతున్నాయి. కూరలు వండాలంటే భయమేస్తోంది. ధరల్ని అదుపులోకి తీసుకురావాలి. సామాన్యులకు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. **- నీలిమ, వినియోగదారు**

రతన్‌టాటాను మరువలేం


నివాళులర్పిస్తున్న తెదేపా, ఆర్యవైశ్య సంఘాల నాయకులు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: వ్యాపారంలో నిజాయతీతోపాటు దేశభక్తి, సామాజిక సేవలో ముందుండి క్లిష్టకాలంలో అందరిలో స్ఫూర్తి నింపిన వ్యాపార దిగ్గజం రతన్ టాటాను మరువలేమని తెదేపా వాణిజ్య విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు నోముల వెంకటరమణ, పట్టణ అధ్యక్షుడు బచ్చు కొండలు పేర్కొన్నారు. తెదేపా వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో రతన్‌టాటా సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, తెదేపా నాయకులు రామకోటేశ్వరరావు, శ్రీనివాసరావు, కాశి తదితరులు పాల్గొన్నారు.


పెదకూరపాడు శివాలయంలో..


మాచవరం: శివాలయంలో..


అమరావతి: దుర్గాదేవిగా బాలచాముండికా


సత్తెనపల్లి మండలం పెదమక్కెనలో..


అచ్చంపేట: వాసవీ కన్యకాపరమేశ్వరి


అచ్చంపేట సీతారామస్వామి దేవస్థానంలో ధాన్యలక్ష్మిగా..


గురజాల: కనకదుర్గమ్మ..


మాచర్ల: కాళీమాతగా వాసవీమాత


కారంపూడిలో అంకాళమ్మ


రెంటచింతల: కనకదుర్గగా వాసవీమాత

శక్తిరూపిణి.. ముక్తిదాయిని

దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు కనులపండువగా సాగుతున్నాయి. అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిస్తున్నారు. పెద్దసంఖ్యలో మహిళలు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. గురువారం అమ్మవార్లను దుర్గాదేవిగా అలంకరించి పూజలు, అభిషేకాలు చేశారు. **- న్యూస్‌టుడే, బృందం**


సత్తెనపల్లి: త్రిశక్తి దుర్గా పీఠంలో దుర్గమ్మ


సత్తెనపల్లి: నీలంపాటి శ్రీలక్ష్మి అమ్మవారు


సత్తెనపల్లి: వడ్డవల్లి బొడ్రాయి సెంటర్‌లో..


బెల్లంకొండలో..


గురజాల: పాతపాటేశ్వరి ఆలయంలో..


రాజుపాలెం: అకులగణపవరంలో..


సత్తెనపల్లిలో మహిళల పూజలు


పిడుగురాళ్ల: బోళాలింగేశ్వరస్వామి ఆలయంలో


పిడుగురాళ్ల: గంగమ్మతల్లీ ఆలయంలో


పిడుగురాళ్ల: కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో


క్రోసూరు వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయంలో..


బతుకమ్మకు పూజలు చేస్తున్న మహిళలు

మహిళా చట్టాలపై అవగాహన

కారంపూడి, న్యూస్‌టుడే: మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని న్యాయసేవ అధికార ప్రతినిధి రూనీ్ తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలకు చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ, జాతీయ మహిళా కమిషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. గృహ హింస, వరకట్న వేధింపుల చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాద్, ఇన్‌ఛార్జి ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, అమీనా రెహమాన్, న్యాయవాది సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సత్తెనపల్లిలో భారీ వర్షం

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: భారీ వర్షంతో గురువారం పట్టణం జలమయమైంది. లోతట్టు ప్రాంతాల్లోకి నీరు చేరింది. తాలుకా సెంటర్‌లోని కోర్టు ఆవరణ తటాకాన్ని మరిపించింది. కాలనీల్లోని రోడ్లు చిత్తడిగా మారాయి.

పారిశ్రామికవేత్తలకు దిక్సూచి

పిడుగురాళ్ల: దేశంలోని పారిశ్రామికవేత్తలకు రతన్‌టాటా దిక్సూచి అని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు చెప్పారు. గురువారం బ్రాహ్మణపల్లి, శాంతినగర్ గ్రామాల వద్ద ఆయన మాట్లాడుతూ దేశం, ప్రజల కోసం రతన్‌టాటా పనిచేశారన్నారు. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి రతన్‌టాటా సేవలు కొనియాడారు.

ఓటు నమోదు చేసుకోండి

గురజాల: పట్టభద్రుల ఓటు నమోదుకు అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆలపాటి రాజా బరిలో ఉన్నారని, ఆయనను గెలిపించాలని కోరారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

రాజుపాలెం, న్యూస్‌టుడే: తాగునీరు, పారిశుద్ధ్యం, ఉపాధి పనులు, అంతర్గత రహదారుల నిర్మాణ పనుల్లో అందరూ భాగస్వాములు కావాలని ఎంపీడీవో సత్యన్నారాయణ సూచించారు. గురువారం రాజుపాలెంలో ఉపసర్పంచులు, వార్డు సభ్యులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

ఆలయాల్లో ఎమ్మెల్యే పూజలు

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే: పట్టణంలోని 8వ వార్డులో కనకదుర్గ అమ్మవారి ఆలయంలో గురువారం ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. 8వ వార్డులోని చర్చి వార్షికోత్సవంలో పాల్గొన్నారు.

తహసీల్దారు మృతికి సంతాపం


నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యేలు జూలకంటి బ్రహ్మారెడ్డి, అశోక్‌రెడ్డి

వెల్దుర్తి, న్యూస్‌టుడే: ప్రకాశం జిల్లా అర్ధవీడు తహసీల్దారు దాసు బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన స్వగ్రామం రచ్చమల్లపాడు గ్రామానికి గురువారం మృతదేహాన్ని తీసుకురాగా. . ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి నివాళులు అర్పించారు. అనంతరం తహసీల్దారు కుటుంబాన్ని పరామర్శించారు.

మద్యం దుకాణాలకు 171 దరఖాస్తులు

సత్తెనపల్లి: సత్తెనపల్లి ఎక్సైజ్ పోలీసు స్టేషన్ పరిధిలో సత్తెనపల్లి పట్టణం, మండలం, ముప్పాళ్ల, రాజుపాలెం మండలాల నుంచి 15 మద్యం దుకాణాలకు 171 దరఖాస్తులు దాఖలైనట్లు సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. అత్యధికంగా రాజుపాలెం మండలంలోని ఓ దుకాణానికి 29, మరో దుకాణానికి 23 దరఖాస్తులు దాఖలయ్యాయన్నారు. ముప్పాళ్ల మండలంలోని ఓ దుకాణానికి 20 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈనెల 14వ తేదీ ఉదయం 8 గంటలకు నరసరావుపేట పట్టణంలోని ప్రకాష్‌నగర్ టౌన్‌హాలులో లాటరీ ప్రక్రియ ఉంటుందన్నారు.

ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: ఎరువులు అధిక ధరకలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరెడ్డి చెప్పారు. గురువారం పట్టణంలోని ఎరువుల దుకాణాల్లో తనిఖీలు చేశారు.

ఒత్తిడిలేని జీవితం గడపాలి

పెదకూరపాడు: మనిషికి మానసిక ప్రశాంతత లేకుంటే జీవన గమనం లయ తప్పుతుందని పెదకూరపాడు సీహెచ్‌సీ వైద్యుడు చైతన్య అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బంది, రోగులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్యురాలు భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

శుద్ధజల కేంద్రం ప్రారంభం

పెదకూరపాడు: ఐదేళ్ల వైకాపా పాలనలో మూలకు చేర్చిన శుద్ధజల కేంద్రాన్ని కూటమి నేతలు తెరిపించారు. పెదకూరపాడు తాగునీటి చెరువు ప్రాంగణంలో మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ హయాంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ సుజల పథకాన్ని సర్పంచి గుడిపూడి రాజు, కూటమి నేతలు గురువారం తిరిగి ప్రారంభించారు. రూ.3 లక్షలుపైగా ఖర్చు చేసి, పథకాన్ని వినియోగంలోకి తీసుకొచ్చారు.

రతన్ టాటా చెప్పిన ఆర్థిక సూత్రాలు...

రతన్ టాటా గురించి ఆలోచించినప్పుడు మనకు గుర్తుకొచ్చేది ఏమిటి? వ్యాపార రంగంలో ప్రపంచానికి భారత శక్తిని చాటి చెప్పిన ఒక గొప్ప వ్యాపారవేత్త అనే కదా. దీన్ని సాధించే క్రమంలో ఆయన ఎన్నో నిర్ణయాలు తీసుకున్నారు. త్యాగాలూ చేశారు. డబ్బును సంపాదించడం, దాన్ని నిర్వహించే విషయంలో ఆయన సూచనలు ఎప్పుడూ ఆచరణీయం. ఆయన చెప్పిన కొన్ని సూత్రాలేమిటంటే..



నైతికతతో...

అందరమూ డబ్బు సంపాదించాలనే చూస్తుంటాం. డబ్బును వెంబడించడం చాలా ముఖ్యం. కానీ, దాన్ని నైతికతతో చేయాలి. సంపాదన న్యాయంగా ఉన్నప్పుడే రోజులూ ఆర్థికంగా విజయం సాధిస్తున్నట్లే ఉంటుంది. చెడు మార్గాల్లో, తొందరగా డబ్బును కూడబెట్టాలనుకుంటే మాత్రం పతనం ప్రారంభమవుతుంది.

ఇవ్వడం నేర్చుకోండి..

మనం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నప్పుడే అన్నీ తిరిగి మనకు అందుతాయి. మంచి పనులు, డబ్బు ఈ రెండింటికీ ఇదే సూత్రం వర్తిస్తుంది. అవసరంలో ఉన్న వారిని మీరు ఆర్థికంగా ఆదుకుంటే.. మీకు కష్టకాలం వచ్చినప్పుడు మీ రూపంలోనైనా, ఎవరో ఒకరైనా సహాయం అందుతుంది. అది మీకు వృత్తిలోనూ, ఆర్థికంగానూ మేలు చేకూరుస్తుంది.

అవకాశాలు తీసుకోండి..

అన్నీ సజావుగానే సాగుతున్నాయి కదా అనే ధోరణి నుంచి బయటపడాలి. అప్పుడే మీరు డబ్బు విషయంలోనూ, వృత్తి, ఉద్యోగ జీవితంలోనూ వృద్ధి సాధిస్తారు. అవకాశాలను వదులుకోవద్దు. ధైర్యంగా, వినూత్నంగా ఉండాలి. ప్రతి రోజూ మీ గురించి మీరు సమీక్షించుకోవడం ఎంతో అవసరం.

నిర్ణయాలను గౌరవించండి..

మీరు తీసుకునే నిర్ణయాలను విశ్వసించండి. మంచివా, చెడువా అనేది తర్వాత విషయం. ఒక నిర్ణయం తీసుకునే ముందే దాని గురించి పూర్తిగా విశ్లేషించుకోవాలి. ముఖ్యంగా డబ్బును పెట్టుబడి పెట్టేటప్పుడు. దాని ఫలితం ఎలా ఉంటుందో ముందే అంచనా వేసుకోవాలి. ఒకసారి నిర్ణయం తీసుకున్నాక, దాన్ని సరైనదిగా మార్చుకునేందుకు ప్రయత్నించాలి.

తెలివిగా పెట్టుబడులు..

ఒకే చోట పెట్టుబడులు పెట్టడం వల్ల డబ్బు సంపాదించే అవకాశాలను కోల్పోతాం. అందుకే, వైవిధ్యానికి పెద్దపీట వేయాలి. ఎన్నో రంగాల్లో విస్తరించిన టాటా గ్రూపు ఇందుకు ఉదాహరణ. మన పెట్టుబడులూ అనేక పథకాల్లో ఉండేలా చూసుకోవాలి. ఇందులో కొన్నింటిలో నష్టభయం ఉండొచ్చు. కొన్ని సురక్షితంగా కనిపిస్తాయి. వీటన్నింటినీ సమన్వయం చేసుకుంటూ సాగినప్పుడే ఆర్థికంగా ఉన్నత స్థాయికి చేరుకోగలం.



క్రమానుగత పెట్టుబడి విధానం(సిప్)లో మదుపు చేస్తున్న వారి సంఖ్య ప్రతి నెలా పెరుగుతోంది. మార్కెట్లోకి ప్రవేశించాలనుకునే వారిలో చాలామంది యువతే ఉంటున్నారని ఇటీవలి నివేదికలూ చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో కొత్తగా ఈక్విటీ పెట్టుబడులు పెట్టేవారు అనుసరించాల్సిన వ్యూహాలు తెలుసుకుందాం.

ఇవీ ముఖ్యమే...

- మార్కెట్ హెచ్చుతగ్గుల సమయంలో క్రమశిక్షణతో ఉండండి. ఫండ్లను ఎంపిక చేసేటప్పుడు కేవలం స్వల్పకాలిక రాబడిపైనే దృష్టి పెట్టొద్దు.
- ఐదేళ్ల కాలంలో మంచి పనితీరు చూపిస్తే, దానినే ఆ ఫండ్లను ఎంచుకోవడానికి ప్రామాణికంగా చూడొద్దు.
- దశల వారీగా పెట్టుబడులు కొనసాగించండి. మార్కెట్ పడిపోతున్నప్పుడూ పెట్టుబడులు కొనసాగాలి. క్రమం తప్పకుండా పెట్టుబడులు పెట్టడంపైనే దృష్టి సారించండి.
- ప్రారంభంలోనే ఒకే రంగానికి పరిమితమయ్యే సెక్టోరియల్ ఫండ్లపై ఎక్కువగా దృష్టి పెట్టొద్దు.
- మార్కెట్లో అస్థిరతకు సిద్ధంగా ఉండాలి. సూచీల్లో 10-20 శాతం క్షీణత సర్వసాధారణం. ఇప్పుడు మార్కెట్లోకి వస్తున్న మదుపరులు 30 శాతం తగ్గినా ఇబ్బంది లేదు అనే ధోరణితో ఉండాలి.

కొత్తగా సిప్ చేస్తుంటే

స్టాక్ మార్కెట్ సూచీలు గరిష్ఠ స్థాయుల్లో కొనసాగుతున్నాయి. ఇలాంటప్పుడు పెట్టుబడులు కొంచెం నష్టభయంతో కూడుకున్నవే. అయినప్పటికీ.. సిప్ ద్వారా మార్కెట్లో ఉన్న అవకాశాలను అందుకునేందుకు వీలుంది.

నిధిని సృష్టించండి: అత్యవసర పరిస్థితుల్లో దీర్ఘకాలిక పెట్టుబడుల నుంచి డబ్బును తీయకుండా ఉండాలి. ఇందు కోసం కనీసం ఆరు నెలల ఖర్చులకు సరిపోయే మొత్తం మీకు ఎప్పుడూ అందుబాటులో ఉండాలి. ఇందుకోసం లిక్విడ్ ఫండ్లలో సిప్ చేయొచ్చు.

మధ్యస్థ కాలానికి: చాలామంది యువ పెట్టుబడిదారులకు కొన్ని మధ్యస్థ కాల లక్ష్యాలు ఉంటాయి. ఇలాంటి అవసరాల కోసం విడిగా మదుపు చేయాలి. ఉదాహరణకు కారు కొనాలని అనుకోవచ్చు. లేదా ఇంటి కోసం ముందస్తు చెల్లింపు కావచ్చు. ఇలాంటి వాటన్నింటికీ ప్రత్యేకంగా ఒక సిప్‌ను ప్రారంభించాలి. స్వల్పకాలిక డెట్ ఫండ్లను ఇందుకోసం ఎంపిక చేసుకోవచ్చు.

దీర్ఘకాలిక లక్ష్యంతో: మీరు సాధించాల్సిన లక్ష్యం 15-20 ఏళ్ల, అంతకు మించి ఉంటే.. దీర్ఘకాలిక వ్యూహంతో పెట్టుబడులు పెట్టాలి. పిల్లల ఉన్నత చదువులు, మీ పదవీ విరమణ లాంటివి ఇందుకు ఉదాహరణ. ఇందుకోసం నష్టభయాన్ని భరించే సామర్థ్యం ఆధారంగా 80-90 శాతం వరకూ ఈక్విటీ ఆధారిత మ్యూచువల్ ఫండ్లలో మదుపు ప్రారంభించాలి.

కొత్తగా మార్కెట్లోకి ప్రవేశించే వారు నిఫ్టీ లేదా సెన్సెక్స్ సూచీల ఆధారంగా పనిచేసే లార్జ్ క్యాప్ ఫండ్లను పరిశీలించాలి. ఈక్విటీ అంటేనే అస్థిరతకు మారుపేరు. వీటికి మానసికంగా అలవాటు కావాలి. ఇందుకోసం కనీసం రెండు మూడేళ్ల సమయం పడుతుంది. ఆ తర్వాతే నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ వంటి వాటికి కొంచెం ఎక్కువ మొత్తంలో పెట్టుబడిని కేటాయించాలి.

పెట్టుబడుల్లో కొద్దిగా అనుభవం వచ్చాక దీర్ఘకాలిక పోర్ట్‌ఫోలియోను సిద్ధం చేసుకోవాలి. ఇందులో 70-80 శాతం వరకూ నిఫ్టీ ఇండెక్స్ ఫండ్, వాల్యూ ఫండ్, లో వోలటిలిటీ ఫండ్లవంటివి ఉండాలి. ఆ తర్వాత.. అధిక రాబడి కోసం ప్రయత్నించాలి. స్మాల్, మిడ్ క్యాప్ ఫండ్లలో అస్థిరత అధికంగా ఉంటుంది. అదే సమయంలో లాభాలకూ అవకాశం ఉంటుంది. అనుభవం వచ్చాకే వీటిపై దృష్టి పెట్టాలి.

వైవిధ్యంగా: కేవలం ఈక్విటీల్లోనే పెట్టుబడులు పెట్టడం మంచిది కాదు. డెట్, బంగారం, ఇతర పథకాలనూ పరిశీలించాలి. పెట్టుబడుల్లో కనీసం 20 శాతం వరకూ వీటికి కేటాయించాలి. అప్పుడే పోర్ట్‌ఫోలియో స్థిరంగా ఉంటుంది.

షేర్ల విలువ తగ్గినప్పుడు...

స్టాక్ మార్కెట్లో కొన్ని సందర్భాల్లో మంచి కంపెనీల షేర్లూ తక్కువ ధరకు లభిస్తుంటాయి. ఇలాంటి వాటిల్లో మదుపు చేసినప్పుడు దీర్ఘకాలంలో మంచి లాభాలు సాధించేందుకు అవకాశం ఉంటుంది. ఇలాంటి వ్యూహంతోనే యాక్సిస్ మ్యూచువల్ ఫండ్ నుంచి ఒక కొత్త పథకం అందుబాటులోకి వచ్చింది. యాక్సిస్ నిఫ్టీ 500 వాల్యూ 50 ఇండెక్స్ ఫండ్ అనే ఈ పథకం ఎన్‌ఎఫ్ఓ ఈ నెల 18 వరకూ అందుబాటులో ఉండనుంది. కనీస పెట్టుబడి రూ.100. ఈ ఓపెన్ ఎండెడ్ పథకం ఇండెక్స్ ఫండ్స్ రకానికి చెందింది. నిఫ్టీ 500 వాల్యూ 50 టీఆర్ఐ సూచీ ప్రామాణికంగా పనిచేస్తుంది. నిఫ్టీ 500లో వాస్తవిక ధరకన్నా తక్కువ ధరకు లభిస్తున్న కంపెనీలను ఎంచుకొని, పోర్ట్‌ఫోలియోను నిర్మిస్తుంది. దీర్ఘకాలం పాటు మదుపు చేయాలనుకునే మదుపరులకు ఈ పథకం అనుకూలమని చెప్పొచ్చు.

వేచి చూసే వ్యవధి తక్కువగా

ఆరోగ్య బీమా పాలసీ తీసుకున్నప్పుడు ముందస్తు వ్యాధుల చికిత్సకు సాధారణంగా 36 నెలల పాటు వేచి ఉండే వ్యవధి ఉంటుంది. దీనికి భిన్నంగా పాలసీ తీసుకున్న 31 రోజు నుంచే ఇలాంటి వ్యాధుల చికిత్సకు పరిహారం అందించేలా మణిపాల్ సిగ్నా హెల్త్ ఇన్సూరెన్స్ 'సర్వ' పేరుతో సరికొత్త పాలసీని తీసుకొచ్చింది. ఈ పాలసీలో ప్రధానంగా మూడు ఆప్షన్లు ఉన్నాయి. సర్వ ప్రథమ్‌లో క్యాన్సర్, గుండె జబ్బులు ఇతరత్రా వ్యాధుల చికిత్సకు సంబంధించి రూ.3 కోట్ల వరకూ బీమాను తీసుకోవచ్చు. మధుమేహం, అధిక రక్తపోటు, ఆస్తమా, ఊబకాయం వంటి ముందస్తు వ్యాధుల చికిత్సకూ 31 రోజుల తర్వాత పరిహారం లభిస్తుంది. సర్వ ఉత్తమ్‌లోనూ సారథి అనే ఆప్షన్ కింద 31 రోజు నుంచి ముందస్తు వ్యాధుల చికిత్సకు పరిహారం అందుతుంది. ఇక సర్వ పరమ్‌లో ఎలాంటి వేచి ఉండే వ్యవధీ లేదు. ఇందులో 'గుల్లక్ అడ్వాంటేజ్' ఆప్షన్‌లో క్లెయిములతో సంబంధం లేకుండా ఏటా 100 శాతం వరకూ పాలసీ విలువ పెరుగుతుంది. ఇలా గరిష్ఠంగా 10 రెట్ల వరకూ పాలసీ విలువ అధికం అవుతుంది. వీటన్నింటిలోనూ ఆసుపత్రిలో చేరే 90 రోజుల ముందు, ఇంటికి వచ్చాక 180 రోజుల వరకూ అయ్యే ఖర్చులు చెల్లించేలా ఏర్పాటు ఉంది. రూ.3 కోట్ల వరకూ వ్యక్తిగత ప్రమాద బీమా కవరేజీని అందిస్తాయి. గడువు ముగియడానికి 30 రోజుల ముందే పాలసీని పునరుద్ధరిస్తే ప్రీమియంపై 2.5 శాతం వరకూ రాయితీ లభిస్తుంది. ఇద్దరు లేదా అంతకు మించి కుటుంబ సభ్యులకు కలిసి ఒకే పాలసీని తీసుకుంటే 10 శాతం వరకూ 'ఫ్యామిలీ డిస్కౌంట్' అందిస్తున్నట్లు సంస్థ తెలిపింది.

కొత్త పథకం

జీవితాంతం పింఛను అందేలా

పదవీ విరమణ అనంతరం జీవితాంతం వరకూ పింఛను అందించే డిఫర్డ్ యాన్యుటీ ప్లాన్‌ను రిలయన్స్ నిప్పాన్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ అందుబాటులోకి తీసుకొచ్చింది. దీని పేరు రిలయన్స్ నిప్పాన్ లైఫ్ నిశ్చిత్ పెన్షన్. ఆర్థిక సర్వే నివేదిక ప్రకారం 2041 నాటికి దేశ జనాభాలో 15.9 శాతం మంది 60 ఏళ్లకు పైబడిన వారే ఉంటారు. ఈ నేపథ్యంలో పింఛను పథకాలకు ఎంతో ప్రాధాన్యం ఉంది. ముఖ్యంగా చిన్న కుటుంబాలు పెరుగుతున్నందున ఆర్థికంగా ఎవరి మీదా ఆధారపడాల్సిన అవసరం లేకుండా డిఫర్డ్ యాన్యుటీ పథకాలు తోడ్పడతాయని సంస్థ పేర్కొంది. ఈ పాలసీలో జీవితాంతం వరకూ పింఛను వచ్చేలా ఏర్పాటు చేసుకోవచ్చు. ఆ తర్వాత జీవిత భాగస్వామి, పిల్లలకు, తోబుట్టువులకూ పింఛను అందే ఏర్పాటు చేయొచ్చు. 5 నుంచి 10 ఏళ్ల వరకూ పాలసీకి ప్రీమియం చెల్లించే ఏర్పాటు ఉంది. ఏదైనా అనుకోని అనారోగ్యం, వైకల్యం సంభవించినప్పుడు డబ్బును వెనక్కి తీసుకునే వీలుంది.

ఐసీఐసీఐ బ్యాంక్‌లో మోసాలపై సీఐడీ దర్యాప్తు ప్రారంభం



ఐసీఐసీఐ బ్యాంకులో సిబ్బంది, ఖాతాదారులను విచారిస్తున్న సీఐడీ అడిషనల్ ఎస్పీ ఆదినారాయణ

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే : చిలకలూరిపేట, నరసరావుపేట, విజయవాడ భారతీనగర్ ఐసీఐసీఐ బ్యాంకుల్లో గతంలో మేనేజర్‌గా పనిచేసిన నరేష్ చంద్రశేఖర్ మరో ఇద్దరితో కలిసి నాలుగు రకాలుగా చేసిన మోసాలపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టినట్లు గుంటూరు సీఐడీ అడిషనల్ ఎస్పీ ఆదినారాయణ తెలిపారు. చిలకలూరిపేట ఐసీఐసీఐ బ్యాంకులో జరిగిన అక్రమాలపై ఆయన, సీఐ సంజీవ్‌కుమార్‌ల బృందం గురువారం ఉదయం 11 నుంచి సాయంత్రం వరకు బ్యాంకులో విచారణ చేశాఉ. మధ్యలో బయటకు వచ్చిన అడిషనల్ ఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ మూడు శాఖల్లో గతంలో పనిచేసిన నరేష్ 72 మంది ఖాతాదారుల డబ్బు రూ.28 కోట్లు దారి మళ్లించినట్లు ఐసీఐసీఐ బ్యాంక్ విజయవాడ జోనల్ మేనేజర్ సందీప్ మెహ్రా సీఐడీకి ఫిర్యాదు చేశారన్నారు. అక్కడి నుంచి కేసును గుంటూరు సీఐడీకి అప్పగించగా తాము చిలకలూరిపేట వచ్చి బ్యాంకు సిబ్బందిని, ఖాతాదారులను విచారిస్తున్నట్లు పేర్కొన్నారు. జులైలో మేనేజర్ మోసాలు గుర్తించిన ఐసీఐసీఐ బ్యాంక్ అతన్ని సస్పెండ్ చేసి ఉద్యోగం నుంచి తొలగించినట్లు తెలిపారు. అతను పని చేసిన మూడు శాఖల్లో ఎవరెవరు ఉద్యోగులు ఉన్నారు... వారి పాత్రపై కూడా ఆరా తీస్తున్నట్లు తెలిపారు. శాశ్వత డిపాజిట్లు, ఓడీలు, గోల్డ్, చెక్కులు తీసుకోవడం ప్రధానాంశాలుగా మోసాలు జరిగినట్లు తెలుస్తోందన్నారు. ఎవరైనా బాధితులు ఉంటే తమ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే వాటి మీద కూడా విచారణ చేసి.. న్యాయం చేసేలా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు.

గల్లంతైన యువకుడి బంధువుల ఆందోళన

అమరావతి, న్యూస్‌టుడే: కృష్ణానదిలో ఈతకు వెళ్లి గల్లంతైన యువకుడి ఆచూకీ గుర్తించడంతో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బంధువులు ఆందోళన చేపట్టారు. బుధవారం కృష్ణానదిలో ఈతకు దిగిన మల్లాది గ్రామానికి చెందిన సాల్మన్‌రాజు(17) నీటిలో మునిగి గల్లంతయ్యాడు. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టినా కనుగొనలేక పోయారు. గురువారం కూడా కొంతమందితో గాలింపు చర్యలు చేపట్టారు. అయితే ఎన్డీఆర్ఎఫ్ బలగాలు రాకపోవడం, అధికారులు గాలింపు చర్యలపై నిర్లక్ష్యం వహిస్తున్నారని యువకుడి బంధువులు ఆరోపిస్తూ అమరావతి - క్రోసూరు రహదారిపై మల్లాది బస్టాప్ వద్ద ఆందోళనకు దిగారు. తమకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. సుమారు రెండు గంటలపైగా బైఠాయించడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. సంఘటనా స్థలానికి అమరావతి సీఐ శ్రీనివాసరావు చేరుకుని బాధితులతో చర్చించారు. ఎన్డీఆర్ఎఫ్ బలగాలు వస్తున్నాయని, గాలింపు చర్యలు వేగవంతం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 123, రిటైల్ ధర - 145, చికెన్ విత్‌స్కిన్ - 210, చికెన్ స్కిన్‌లెస్ - 239.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 138, 148 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 525 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.93/-.